క్లుప్తంగా

95 మంది ఆధార్ నవీకరణ



కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఆధార్ వివరాలను నవీకరిస్తున్న మల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం: ఎంపీడీఓ కె.రత్నకుమారి ఆదేశాల మేరకు విద్యాలయాల్లో సచివాలయ సిబ్బంది ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్ ఇనుమర్తి మల్లేశ్వరరావు 40 మంది విద్యార్థుల వివరాలను నవీకరించారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్ కొర్రా దొరబాబు 40 మంది విద్యార్థులు, మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫణి 15 మంది విద్యార్థుల వివరాలను నవీకరించారు. ప్రభుత్వ పథకాల అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ఆధార్, విద్యా సర్టిఫికెట్లలో తప్పులను సరిచేసే లక్ష్యంతో శిబిరాలను నిర్వహిస్తున్నారు.

గీతకార్మికులకు మద్యం షాపులు కేటాయించాలి

కాజులూరు: గీతకార్మికులకు మద్యం షాపులు కేటాయించాలని మండల గీతకార్మిక సంఘం నాయకుడు పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే జనరల్‌కు షాపులు కేటాయించి నెల రోజులు పైబడిన గీతకార్మికులకు కేటాయిస్తామన్న షాపులను పట్టించుకోవటం లేదన్నారు. త్వరితగతిన షాపుల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

సచివాలయ రోడ్డునైనా మెరుగుపరచండి



అధ్వానంగా ఉన్న వెదురుమూడి సచివాలయ రహదారి

కపిలేశ్వరపురం: సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం రాగానే రహదారులను అద్దంలా మార్చేస్తామంటూ ఎన్నికలకు ముందు ప్రచార బాకా ఊదారు. అర్ధ సంవత్స పాలనా కాలం పూర్తవుతున్నా రహదారులు అధ్వానంగానే దర్శనమిస్తున్నాయి. వెదురుమూడి సచివాలయానికి వెళ్లే రహదారి సైతం అధ్వానంగా ఉంది. సచివాలయానికి వెళ్లేందుకు రెండు రహదారులుండగా ఆ రెండూ లోతైన గుంతలతో ఉన్నాయి. అటు ఉద్యోగులు, సందర్శకులు నానా యాతన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రహదారిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాదాత వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు

మండపేట: విద్య, వైద్య, ఆరోగ్య ప్రదాతగా పేరొందిన పెదపాటి వెంకటరెడ్డి విగ్రహాన్ని బుధవారం మండలంలోని కేశవరం జెడ్పీ హైస్కూల్లో ఆవిష్కరించారు. వెంకటరెడ్డి కుటుంబ సభ్యుడైన కామిరెడ్డి వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి వెంకటరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరెడ్డి గ్రామంలోని రైతులు, విద్యార్థులు, పేదల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో చంద్రమళ్ల రాజారు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్న కుమార్, వార్డు సభ్యుడు గోవిందు, సవివాడ వెంకన్న, ఎల్ల రవి, తొర్లపాటి ప్రసాద్, కొక్కిరి శేఖర్, గుత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధనను విజయవంతం చేయాలి

కె.గంగవరం: ఈ నెల 23న వెంకటాయపాలెంలో జరిగే తాలూకా శెట్టిబలిజ సంఘం కార్తిక వనసమారాధనను విజయవంతం చేయాలని శెట్టిబలిజ నాయకుడు నరాల ఏడుకొండలు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సంఘం సభ్యులతో నాయకులు పర్యటించి కార్తిక వనసమారాధనను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 23 ఉదయం 9 గంటల నుంచి వెంకటాయపాలెంలో వనసమారాధన జరుగుతుందని శెట్టిబలిజలంతా కుటుంబాలతో హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం

- కూరగాయల ధరలతో ధరాభారం
- ఘాటెక్కిన ఉల్లి
- సామాన్య, మధ్య తరగతి వినియోగదారుల ఆందోళన

రామచంద్రపురం రూరల్: నిత్యావసరాల్లో ప్రధానమైన కూరగాయల ధరలు ప్రస్తుతం మాంసాహారానికి దీటుగా ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి ఘాటెక్కిస్తుండగా.. అన్ని కూరగాయల ధరలూ ఆకాశాన్నంటుతుండటంతో సామాన్య, మధ్య తరగతి వినియోగదారులకు ఆందోళన చెందుతున్నారు. కార్తిక మాసం కావడంతో అధిక శాతం ప్రజలు కూరగాయలపైనే ఆధారపడతారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం రూరల్, రామచంద్రపురం పట్టణం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో ఎక్కడా రైతు బజార్లు అందుబాటులో లేవు. దీంతో కూరగాయల అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కన్నీరు తెప్పిస్తున్నాయి..

ప్రస్తుతం నియోజకవర్గంలో కూరగాయలు కొనలేని పరిస్థితి. గతంలో కంటే కేజీ కూరగాయల ధరలు రెండింతలు పెరిగి సామాన్యులకు కంట నీరు తెప్పిస్తున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యులు ఏమి కొనలేం, తినలేం అంటున్నారు. అధిక వర్షాల కారణంగా కూరగాయల దిగుబడి తగ్గడంతో ధరలు ప్రస్తుతం తారా స్థాయికి చేరాయి. ఏ కూరగాయలు కొన్నా కేజీ రూ.50 నుంచి రూ.60 ధర పలుకుతుంది.

రోజు రోజుకూ మారుతున్న ధరలు..

గత నెల రోజుల నుంచి కూరగాయల ధరల రోజురోజుకూ మారుతూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయం పెరిగే అవకాశం లేకపోయిన కూరగాయల ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు సార్లు కూరగాయల ధరలు పెరిగాయి. దీంతో ఎప్పటికప్పుడు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రస్తుతం కూరగాయల పేరు వింటేనే ఆయా కుటుంబాల్లో వణుకు పుడుతుంది.

తగ్గిన మాంసం విక్రయాలు..

హిందువులకు ప్రీతికరమైన శరన్నవరాత్రులు, వెంటనే కార్తిక మాసం రావడంతో ఎక్కువ మంది మాంసాహారం జోలికి వెళ్లకుండా కూరగాయలను మాత్రమే తినేందుకు ఆసక్తి చూపుతారు. దీంతో మాంసాహార దుకాణాలు అమ్మకాలు లేక వెలవెలబోతున్నాయి. దీంతో పాటు రెస్టారెంట్లు, హోటళ్లలో కూడా విక్రయాలు బాగా తగ్గాయని వ్యాపారుల చెబుతున్నారు. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు ఆకుకూరులు, పప్పులపై ఆధారపడుతున్నారు

ప్రస్తుతం కూరగాయల రేట్లు.. (కేజీల్లో)

ఉల్లిపాయలు..	రూ.40–70
క్యారెట్	రూ.60
బీరకాయలు	రూ.30–40
టమాటాలు	రూ.30–40
బెండకాయలు	రూ.40
వంకాయలు	రూ.60
పచ్చిమిర్చి	రూ.40
దొండకాయలు	రూ.40
దోసకాయలు	రూ.50
బీట్‌రూట్	రూ.50
క్యాబేజీ	రూ.50
ఆకాకరకాయలు	రూ.100
చిక్కుడుకాయలు	రూ.120



కూరగాయలు కొంటున్న వినియోగదారులు

చర్యలు తీసుకోవాలి



ఆకుకూరలు, కూరగాయలు ఆరోగ్యానికి మంచిదని అందరూ చెబుతుంటారు. కానీ మార్కెట్లో రేట్లు చూస్తే సామాన్యులు కొనలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ధరలను అదుపులోకి తెచ్చే చర్యలు తీసుకోవాలి. సామాన్యులకు ఊరట కలిగించాలి.

– గండి లక్ష్మి, గృహిణి, రామచంద్రపురం

సంచి నిండటం లేదు



కూరగాయల కోసం వెళ్లినప్పుడు రూ.500 తీసుకెళితే కనీసం చేతి సంచి నిండలేని పరిస్థితుల్లో ధరలు మండిపోతున్నాయి. ధరలకు భయపడి ఏవైనా రెండు రకాల కూరగాయలతో సరిపెట్టుకున్నా బిల్లు రూ.100 దాటుతుంది. రైతుబజారు లాంటి సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తే బాగుంటుంది.

– సాదే నాగరాజు, ఆదివారపుపేట, రామచంద్రపురం మండలం

ఇంధన వనరులు సమృద్ధిగా అందించడమే లక్ష్యం

రామచంద్రపురం: భవిష్యత్తు తరాలకు ఇంధన వనరులను సమృద్ధిగా అందించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఆదాపై దృష్టి సారించాయని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మురళీమోహన్‌రావు అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉర్జా వీర పథకంపై బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో శ్రీప్రజాకాంతి ఎలక్ట్రీషియన్ ప్లంబర్ అండ్ రివైండింగ్ వర్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీవీ కృష్ణ సెక్రటరీ మల్లికార్జున్‌రెడ్డి తదితరులకు 50 మందికి శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వినియోగించే ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, లైట్లు కరెంటు స్టౌ, ఏసీ పరికరాలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫైవ్ స్టార్ రేటింగ్ పరికరాలను వినియోగించడంతో విద్యుత్ ఆదా అవుతుందన్నారు. గృహాలకు ఎలక్ట్రికల్ వైరింగ్ చేసే ఎలక్ట్రీషియన్లు ఈ దశగా వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఉర్జా వీర పథకంలో నమోదు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి పారితోషకాలు ఇస్తుందన్నారు. ఉర్జా వీర వెబ్‌సైట్‌లో ఎలక్ట్రీషియన్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 22న గుంటూరులో ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. అప్పటికి డివిజన్ పరిధిలో ఉన్న ఎలక్ట్రీషియన్లు ఉర్జా వీర వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా కృషి చేస్తామన్నారు, అనంతరం అసిస్టెంట్ ఇంజినీర్ రామచంద్రపురం రూరల్ ఎంవీ రమణ ఉర్జా వీర పథకంపై ఎలక్ట్రీషియన్లకు అవగాహన కల్పించారు.



ఉర్జావీర పథకంపై వివరిస్తున్న ఈఈ రత్నాలరావు

సర్వే సిబ్బందికి పట్టణంలో శిక్షణ

మండపేట: పట్టణంలో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపార రంగాల వారి వివరాల కోసం సర్వే నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా వార్డు సర్వే నిర్వహించేందుకు వీలుగా సచివాలయ సిబ్బంది శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సర్వే పూర్తయి ఎంఎస్ఎంఈఎస్ పోర్టల్‌లో రిజిస్టర్ అయితే ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే ప్రోత్సాహకాలు, బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు మంజూరవుతాయని వివరించారు. అంతేగాకుండా ఐఎస్ఓ, జెడ్ఈడీ, ఐఎస్ఐ వంటి క్వాలిటీ సర్టిఫికెట్లు పొందడానికి కూడా ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. పట్టణ పరిధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానులు, వ్యాపారవేత్తలు ఈ సర్వేకు సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె. శ్రీనివాస్, ఏఈ పవన్ కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న కమిషనర్ రంగారావు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

రామచంద్రపురం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. రామచంద్రపురం పిల్లా వారి వీధి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీఈఓ సలీం బాషా మాట్లాడుతూ ప్రతి ఫలితాల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. గత ఫలితాలను బేరీజు వేసుకుని వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను జ్ఞాన సముపార్జనకు నిలయాలుగా మార్చుకోవాలన్నారు. అంతకు ముందుగా ఆయన రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. డీఈఓ వెంట రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహఫణి, సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

చిక్కాల కాటయ్య విగ్రహావిష్కరణ

రామచంద్రపురం రూరల్: కోల సంబరం కళకు మూల పురుషుడు చిక్కాల కాటయ్య విగ్రహావిష్కరణ బుధవారం మండలంలోని వెల్ల గ్రామంలో కోల సంబరం కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోల సంబరం కళాకారులు మాట్లాడుతూ చిక్కాల కాటయ్య సుమారు 200 ఏళ్ల క్రితం తిరుపతి వేంకటేశ్వరస్వామి సన్నిధికి కాలినడకన వెళ్లిన సందర్భంలో వేంటేశ్వరస్వామి చరిత్రను కోల సంబరం కళను ప్రారంభించారు. అనంతరం ఈ కళను ఆయనతోనే అంతమై పోకుండా అనేక మందికి నేర్పించగా నేడు వేల మంది ఈ కళను జీవనోపాధిగా చేసుకుని దైవసేవ చేస్తున్నారు. దీంతో ఆ కళాకారులంతా కోల సంబరం కళకు ఆద్యుడైన చిక్కాల కాటయ్య విగ్రహాన్ని ఆయన స్వగ్రామం వెల్ల గ్రామంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపాన ప్రతిష్ఠించి నివాళులర్పించారు. సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న తమలో చాలా మంది పేద కళాకారులు ఉన్నారని వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, రెడ్నం సతీష్, ఎంపీపీ అంబటి భవాని, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, విగ్రహశిల్పి వడయార్ తదితరులు పాల్గొన్నారు.



వెల్లలో ఆవిష్కరించిన చిక్కాల కాటయ్య విగ్రహం

ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈఓ సలీం బాషా

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కే సలీం బాష బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల భాషా కౌశలాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు సరైన ప్రణాళికలను రూపొందించుకుని విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, డీఎస్ఓ గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వాడ్రేవు రత్న పద్మావతి, ఉపాధ్యాయులు విస్సు, శ్రీమన్నారాయణ, సూర్యనారాయణమూర్తి, సుజాత పాల్గొన్నారు.

ఎంపీటీసీ శోభనకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రాయవరం: పతీ వియోగంతో బాధపడుతున్న మాచవరం ఎంపీటీసీ సభ్యురాలు పలివెల శోభనను అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీసమేతంగా బుధవారం పరామర్శించారు. ఎంపీటీసీ శోభన భర్త సతీష్ ఈ నెల 16న గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. సతీష్ చిత్ర పటానికి డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీలు కోట వెంకట్రావు, కత్తుల అప్పారావు, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు తదితరులున్నారు.

గ్రంథాలయాలు ఎంతో ఉపయోగం

- ఆర్డీవో అఖిల
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

రామచంద్రపురం: పోటీ పరీక్షల్లో విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని, గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలుగా ఉంటాయని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల అన్నారు. పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 19 వరకు గ్రంథాలయ అధికారి డి.వెంకటరమణ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా పట్టణానికి చెందిన విద్యార్థులతో వివిధ రకాల సృజనాత్మకతలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలైన విద్యార్థులకు ఆర్డీవో చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలుకు వెళ్లి పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ముందుగా వందేమాతరం గీతం ఆలపించగా ఆర్డీవో జ్యోతి ప్రజ్వలన చేశారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తిరుమలరాజు ప్రభాకరవర్మ విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆర్డీవో అఖిల, దాత చందమామ వాసులను గ్రంథాలయ అధికారులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, శాఖ గ్రంథాలయ అధికారి డి.రమణ, లైబ్రరీ అసిస్టెంట్ వనజాక్షి, గరగ ఈశ్వరరావు, పెద్దిరెడ్డి రాము, మునిసిపల్ డీఈ శ్రీకాంత్, కె.రవిబాబు, న్యాయవాది సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాజులూరు: వ్యవస్థలో రోజురోజుకీ ప్రజాదరణ కోల్పోతున్న గ్రంథాలయాలను ప్రజలు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈఓ జాన్ అన్నారు. గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయాధికారి కె.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మారుతున్న యాంత్రిక జీవనంలో పుస్తక పఠనానికి ప్రతి ఒక్కరూ దూరమౌతున్నారన్నారు. పుస్తక పఠనం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు విశ్రాంత గ్రంథాలయాధికారి అన్యం గోవిందు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీరామచంద్రమూర్తి అందించిన బహుమతులు, జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ యాళ్ల వెంకటరమణ, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కె.గంగవరం: గ్రంథాలయాలు ప్రజలను విజ్ఞాన మార్గంలో నడిపించే మార్గదర్శులని ఎంఈఓ నాగరాజు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మండలంలోని పామర్రులోని గ్రంథాలయం వద్ద ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై నిర్వహించిన పలు పోటీలు గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ నాడు గ్రంథాలయాల ద్వారానే ఎంతో విజ్ఞానాన్ని నేర్చుకుని గొప్పవారయ్యారన్నారు. ప్రజలను అన్ని రంగాలో జ్ఞానవంతులు చేయాలని ఆనాటి రోజుల్లో పలువురు కృషి చేసి గ్రంథాలయాలను స్థాపించారన్నారు. అనంతరం పలు పోటిల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు అందించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసు, ఓవీ రమణ, వెంకట్, శ్రీను, వీఆర్ఓ వీరభద్రరావు, గ్రంథపాలకుడు ఎస్.గంగాధర్, ఉపాధ్యాయులు అంజిబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతి ప్రదానం నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉపాధ్యాయులు ఎస్.నాగేంద్రప్రసాద్, ఆర్‌కే రాజశేఖర్, ఎస్.దుర్గాభవానిల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.



రామచంద్రపురంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆర్డీవో తదితరులు



పామర్రులో విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించిన ఎంఈఓ నాగరాజు తదితరులు

విజేతలకు బహుమతుల పంపిణీ

మండపేట: గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పట్టణంలో గ్రంథాలయ అధికారి ఎస్.పూర్ణమ్మ ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు జరిగాయి. ఈ నెల 14 నుంచి 20 వరకూ చిత్రలేఖనం, పుస్తక పఠనం, వ్యాస రచన, వక్తృత్వం క్విజ్, దిశ మహిళా సాధికారతపై చర్చ , లెమన్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు స్థానిక ఎస్‌వీఎ స్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం బహుమతులు అందజేశారు. పాఠశాల ఇన్ చార్జి జి.వెంకటగణేష్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు కూడా బుధవారంతో ముగిశాయి. అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయవరం: మాచవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశాన్ని లైబ్రేరియన్ టి.ప్రమీల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఎస్.ఈశ్వరరావు, రీడర్ నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మానవ జీవిత గమనానికి గ్రంథ పఠనం మార్గదర్శి కాగలదని గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక గ్రంథాలయ అధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగా శ్రీనివాస్, సామాజిక కార్యకర్తలు చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, యేసురత్నం, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్ ఉపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ ఆధునిక తరం వారు గ్రంథ పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు ప్రముఖులు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. చిన్నారులు ఓర్పు నేర్పుతో జీవితంలో ముందుకు సాగాలని ప్రశంసించారు. వారోత్సవాలు నిర్వహణకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు గ్రంథాలయాధికారి శివకుమారి కృతజ్ఞతలు తెలిపారు.



మండపేటలో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు



కపిలేశ్వరపురంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



మాచవరం లైబ్రరీలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో లైబ్రేరియన్ ప్రమీల తదితరులు

టెండర్ - కమ్ - బహిరంగ వేలం ప్రకటన

[illegible]

భూముల వివరము

[illegible]

వి.శ్రీనివాసరావు
కార్యనిర్వహణాధికారి